# ఆమె చూపు

అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టి చొక్కా విప్పి హ్యాంగర్‌కు తగిలించబోతున్నవాడల్లా బైట స్కూటర్ శబ్దం వినిపించడంతో ఆగి కిటికీ గుండా వీధిలోకి చూశాడు ప్రభాకర్.

ఇంటి ముందు స్కూటర్ ఆపి దిగుతున్నాడు సంజీవ్.

చొక్కా లేకుండా తన్ను చూస్తే అవతలి మనిషికి కళ్లు బైర్లు కమ్మొచ్చుననుకొని నీలుక్కొని ఉండే గంజి చొక్కాను తిరిగి తగిలించుకున్నాడు.

వాకిట్లోనుంచే "హాయ్ సంజీవ్" అంటూ ఆహ్వానించాడు.

వంటింట్లోకి వెళుతూ ఓసారి బైటకు చూసింది సుశీల.

"నమస్తే గురువా. బజార్లో కాసేపన్నా ఉంటే నీ సొమ్మేం బోయె. నేనొచ్చేసరికి పరుగెత్తుకొస్తివే" పంచలోకి అడుగేస్తూ నిష్ఠూరంగా అన్నాడు సంజీవ్.

అతనికేసి అదోరకంగా చూశాడు ప్రభాకర్.

"అనండి... అనండయ్యా. టైం మీది. అనండి. బడిడుస్తానే ఇంటికి రాలేదని యింట్లోవాళ్లపోరు. అంగళ్ల ముందు గుంపులు గుంపులుగా నిలబడి కష్టమర్లనెవుర్నీ రాకుండా అడ్డముండామని అంగడోల్లు లోపలల్లోపల తిట్టుకోడాలూ... బుద్ధినేరక యియ్యాల తొందరగా యింటికొస్తే కనిపెట్టుకొని నా ఎనకే వొచ్చి ఎత్తిపొడుపులూ... అనండి".

అతని హావభావ విన్యాసాలకు పకపక నవ్వాడు సంజీవ్.

'సరే సరే గురువా. నీకు హార్టీ కంగ్రాచ్యులేషన్స్‌బ్బా' చెప్పాడు.

సన్నటి చిరునవ్వు పెదాల మీద పూస్తోండగా 'ఎందు'కన్నట్టుగా చూశాడు ప్రభాకర్.

"సిస్టర్‌కు పోస్ట్ వచ్చిందంటగా. మొత్తానికి సాధించినావు గురువా"

"ఓ... అదా... అదేముందిలే" తేలిగ్గా అన్నాడు.

"నీకు సులభమే... యీ కాలంలో గవర్నమెంటు పోస్ట్ సాధించటం మా బోంట్లకు సామాన్యమా గురువా? బట్టతల మీద ఎంటికలైనా మొలిపించొచ్చుగాని" అంటూ ఆగి ప్రభాకర్‌కేసి అదోలా చూస్తూ "సాధించినావు గురువా. అసాధ్యునివి. ఎంతలావు గోల్‌మాల్ జేసినావో.. ఎంత లెక్క పోగొట్టినావో... నిన్ను నమ్ముకొని నీ ఎనకే వొచ్చింటే నేనూ బాగుపడేవాన్ని. నీ సత్తా అంచనా వెయ్యలేకపోతిని" వాపోయాడు సంజీవ్.

సిగరెట్ తీసి స్టైల్‌గా వెలిగించి ఓ దమ్ము లాగాడు ప్రభాకర్.

రిజల్ట్స్ అనౌన్స్ చేసినప్పటి నుంచీ యివే పొగడ్తలు. వీధుల్లో, బడి వద్దా, టీకొట్ల ముందూ ఒకటే భజన. కనిపించిన వాడంతా పొగడటం, తను టీ చెప్పడం, సిగరెట్ ఆఫర్ చేయడం. ఇప్పుడు యింటి వద్దకు కూడా...

పొయ్యిమీద కాఫీ నీళ్ళయినా పెట్టిందో లేదోనని లోపలికి తొంగిచూశాడు. స్టౌ ముందు కదులుతూ వుంది సుశీల. అతిథి మర్యాదల సన్నాహంలో వుందన్నమాట.

“ఎట్లా సాధించినావు గురువా! పేపరు మార్చినావా... సపరేట్‌గా కూకోబెట్టి రాయించినావా... కంప్యూటర్ వద్ద మేనేజ్ చేసినావా...ఏం చేసినావు?” ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ ప్రశ్నిస్తున్నాడు సంజీవ్.

చిద్విలాసంగా నవ్వులు చిందిస్తూ “ఏదొక పన్జేసినాన్లేరా సామీ” అనబోయి ఎందుకో అనుమానం వచ్చి లోపలికి చూశాడు.

కాఫీ కలుపుతూ వంటింట్లోంచి తనకేసే చూస్తోంది సుశీల.

తదేకంగా చూస్తోంది.

కన్నార్పకుండా... సూటిగా... తన కళ్లలోకే.

ఉలికిపాటుకు గురయ్యాడు అతను.

ఆ చూపు తనకెక్కడో తగలరాని చోట తగిలినట్టుగా మెలికలు తిరిగిపోయాడు. అదే చూపు...

నిన్న బట్టలషాపుకెళ్లినప్పుడు చీర సెలక్ట్ చేస్తూ తనకేసి చూసిన చూపు.. అదే చూపు...

షాపతను అందరిలాగే తన సామర్థ్యాన్ని పొగడటం... తను ఆహ్లాదంగా ఆస్వాదించడం...ఏమీ తెలీని అమాయిక గృహిణిగా ఉన్న సుశీలకు తన గోల్‌మాల్ తనంతోనే పోస్టింగ్ తెప్పించినందుకు ఆకాశానికెత్తుతూ వుంటే తను సన్నగా మందహాసం చేస్తూ... మళ్ళీ వంటింటికేసి చూసేసరికి....

ఆమె చూపు సూటిగా తనకేసే ప్రసరిస్తూ...

ఆమె శరీరమంతా రెండు కళ్లుగా...

రెండు కళ్లు ఒకే చూపుగా... ఆ చూపు పెద్ద ప్రశ్నార్థకంలా తన్ను గుచ్చి గుచ్చి వదులుతూ...

ఇప్పుడు కూడా అదే చూపు....

“ఎంతలావు గోల్‌మాల్. ఎంత చాకచక్యం” ఇంకా పొగుడుతూనే ఉన్నాడు సంజీవ్.

ఆమె చూపుల మీదుగా వాటిని స్వీకరించటం ఎందుకో సిగ్గుగా అన్పించింది ప్రభాకర్‌కు.

వెంటనే చెప్పాడు “ఇందులో గోల్‌మాలేం లేదురా సామీ. ఆమె స్వంతంగా టెస్ట్ రాసి ర్యాంకు తెచ్చుకున్నది. కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నది” అని.

చెప్పింతర్వాత కొంత ఊపిరాడినట్లుగా అన్పించింది అతనికి. అప్పటిదాకా ఉగ్గబట్టిన ప్రానానికి కొంత తెరపి వచ్చినట్టుగా తోచింది. సంజీవ్‌కు మాత్రం అతని మాటలు జీర్ణం కాలేదు.

“కతలు జెప్పగాకు గురువా. ఈసారెన్నా మాకు సాయం జెయ్యమని అడుగుతా మనుకొంటే తప్పించుకుంటా వుండావా” అన్నాడు.

లోపల్నించి కాఫీ గ్లాసుల్తో వస్తోంది సుశీల.

"అరె...చెబితే విన్పించుకోవే. రియల్లీ.... ఆమె స్వంతంగా రాసింది సంజీవ్" కాఫీ అందుకుంటూ సుశీల కేసి చూశాడు.

ఆమె చూపుల్లో అదే భావం.

చేతులు తడబడ్డాయి అతనికి.

సంజీవ్ మాత్రం అయోమయానికి గురవుతున్నాడు.

"లేదు సంజీవ్. కష్టపడి రాసిందయ్యా" మిత్రున్ని నమ్మించడానికి చూశాడు.

అతనికి తెలుసు - సంజీవ్ నమ్మడని.

నమ్మకం లేనితనమూ, ఆశ్చర్యమూ కలగలిసిన మిత్రుని చూపులు అతనికి కొత్తగా, వింతగా అన్పించాయి. తనిట్లా చెప్పడం అతన్నించి తప్పించుకోటానికీ, రేపు అతనికి సాయంచేసే భారాన్నించి తప్పించుకోటానికీ ఆడే నాటకంగా అనుమానిస్తున్నాడు.

తమాషాగా ఉంది.

యింట్లోకి చూశాడు.

ఆమె చూపుల్లో యింకా అనుమానఛాయలు పోలేదు.తన మాటల్లోని నిజాయితీని పరీక్షకు పెడుతోన్నట్టుగా ఉంది. తన పరిస్థితి ఆ స్థాయికి దిగజారింది మరి.

ఆమె డిఎస్సీలో సెలక్టయినప్పటి నుంచి అబద్ధాల్ని ఎంజాయ్ చేస్తున్నాడు తను. అబద్ధాల్ని ఆహ్లాదంగా ఆస్వాదించడం కోసం ఎక్కువ సమయాన్ని ఖర్చుచేస్తున్నాడు.

అబద్ధాల్ని యింతగా బతికించుకోవటం వెనక పెద్ద చరిత్రే ఉంది.

డిఎస్సీ టెస్ట్‌కు హాజరు కావడం సుశీలకు యిది నాలుగోసారి. మొదటిసారి ఆమె అందరిలా పరీక్షహాల్లోకి సాధారణ స్థాయిలో అడుగుపెట్టలేదు. ప్రశ్నలకు సమాధానాల్ని ఎంపిక చేసేందుకు సొంతబుర్ర ఉపయోగించకూడదనే షరతు మీద వెళ్లింది.

జవాబుల్ని తయారు చేయించి ఆమెకు చేరవేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేయించాననీ చివరి నిమిషంలో అయినా ఆన్సర్‌షీట్ అందించగలమనీ కాబట్టి ప్రశ్నలకు జవాబులు తెలిసినట్లనిపించినా స్వంత తెలివినుపయోగించి ఒక్క బిట్ కూడా టచ్ చేయొద్దనీ ఆమెకు సీరియస్‌గా వార్నింగిచ్చి పంపాడు ప్రభాకర్.

ఎందుకంటే - ఆడమనిషి, అందులోనూ పెళ్ళయిన స్త్రీ - ఆమె నాలడ్జి మీద నమ్మకం లేదని చెప్పేకంటే తన సమర్థతమీద తనకున్న అపారమైన విశ్వాసం... జనాల ముందు తనేమిటో నిరూపించుకోవాలనే తపన.

పరీక్ష హాల్లోకి జవాబుల్ని పంపేందుకు పెద్ద ఏర్పాటే చేశాడు. పోలీసుల్నీ వాటర్‌బాయ్‌నీ మేనేజ్‌చేశాడు. క్వశ్చన్ పేపర్ బైటకు పంపేందుకు బినామీ అభ్యర్థిని నియమించుకున్నాడు. జవాబుల్ని తయారు చేసేందుకు జీనియస్‌లుగా పేరు తెచ్చుకున్న నలుగురు లెక్చరర్స్‌ను కుదుర్చుకున్నాడు.

పరీక్షల ముందు ఆమె చదవబోయినా తను చదవనీ లేదు. 'ఎందుకు చదవడం? దండగ. చదువుతే పాసయితవా? ఆ కాలాలు పోయినాయమ్మీ. నువ్వు హాయిగా యింటి పన్జేసుకో. ఉద్యోగం తెప్పించే పూచీ నాది' అంటూ భరోసా యిచ్చాడు.

పెళ్లయిన ఏడాది తర్వాత జరిగిన డిఎస్సీ టెస్ట్ అది. ఖచ్చితంగా పోస్ట్ సాధిస్తాననే ధీమాతోనే యింత ప్రయత్నం చేశాడు. దాదాపు పదిహేను వేల రూపాయలు ఖర్చు

చేశాడు. ఆలస్యమైనా అతి కష్టం మీద ఆన్సర్ షీట్ తయారు చేయించి పరీక్ష హాల్లోకి పంపించాడు. వాటర్ బాయ్ పొరపాటు వల్ల అది పక్కసీటు అమ్మాయికి చేరింది. దాన్ని సుశీల యిప్పించుకుని సగం రాసే లోపలే టైమైపోయింది. అట్లా ఓ ప్రయత్నం దారుణంగా విఫలమైంది.

మరో ప్రయత్నం కూడా భారీ ఎత్తున జరిపాడు.

టీచర్ పోస్టులు వదిలారంటేచాలు తను మండలమంతా తెలిసిపోతాడు. తన గోల్‌మాల్ తతంగం అందరి వద్దా చర్చనీయాంశంగా మారుతుంది.

మంది మార్బలంతో తను కడప చేరుకోవటం, లాడ్జి బుక్ చేయటం, జనాన్ని వెంటబెట్టుకు తిరగడం ఇదంతా ఏ కాంట్రక్టరో టెండర్ వేసేందుకు వచ్చినంత హంగామాగా ఉంటుంది.

మూడవ ప్రయత్నం కూడా విఫలమయ్యేసరికి తనకు దాదాపు యాభైవేల రూపాయలకు పైగా చిలుం వదిలినట్టు లెఖ్ఖ.

మిత్రులంతా ప్రయత్నానికి ముందు ప్రోత్సాహమివ్వటం, ప్రయత్నం విఫలమైంతర్వాత యింటి కొచ్చి మరీ సానుభూతి తెలపటం. ప్రతి ఫెయిల్యూరుకూ తనో కారణం సృష్టించి చెప్పుకోవటం.

అతను తరచూ చెప్పే కారణం – మగాడికైతే బైక్యాండిటేట్‌ను పెట్టి ఫోటోలు మార్పించి మేనేజ్ చేసి ఎప్పుడో పోస్టింగ్ తెప్పించేవాణ్ణనీ, ఆడమనిషి కాబట్టి సమస్యగా ఉందనీ....

ఆమె ఎందుకో యీ తతంగాన్నంతా అసహనంగా చూస్తూండటం....

అప్పటికే యిద్దరు పిల్లలు. ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ దశలో మొన్న నాలుగో సారి డిఎస్సీకీ ఆమె సెలక్ట్ కావడం తిరిగి మండలంలో చర్చనీయాంశం అయ్యింది

ఆమె టీచర్ పోస్ట్ సాధించటం వెనక తనెంత గోల్‌మాల్ చేశాడోనని జనమంతా వూహించుకోవటం... తనను అభినందనలతో ముంచెత్తటం.

నిజానికి యీ దఫా తను చేసిందేమీ లేదు.

అప్పటికే ఆర్థికంగా చితికిపోవడంతో 'ఏం చేయాలా?' అని ఆలోచిస్తోంటే ఆమె చెప్పింది. 'నువ్వే ప్రయత్నాలూ చేయొద్దు. నేను చదివి రాస్తా'నని.

అంతే – తనేమిటో నిరూపించుకుంది.

ఆమె సత్తాను తనింతదాకా గుర్తించకపోయినందుకు బాగా బుద్ధి చెప్పింది. రోజువారీ సంసారానికి ఏ మాత్రం సెలవు పెట్టకుండానే స్పెషల్ కోచింగ్ లాంటిదేదీ తీసుకోకుండానే అంతర్గతశక్తుల్ని సమర్థంగా వినియోగించుకుంది.

ఆమెకు ఉద్యోగం రావటం వెనక తన గోల్‌మాల్‌తనమే వుందని జనమంతా పొగుడుతోంటే ఇన్నేళ్ల తన వైఫల్యాల గాయాల్ని ఆ పొగడ్తల మాటున కప్పిపుచ్చుకోవటంలో ఊరట చెందాడు.

ఆమె పరోక్షంలో అయితే తన ఆటలు సాగేవి.

ఇదో – ఇప్పటిలా ఆమె ముందు అబద్ధాల మీద తన గొప్పదనం నిరూపించుకోవాల్సి వస్తేనే చచ్చేంత సిగ్గుగా ఉంటుంది.

సంజీవ్ వెళ్లింతర్వాత యింట్లోకి చూస్తూ అన్నాడు "ఎంత చెప్పినా యీ ఎదవలు నమ్మరే. మనిషి సామర్థ్యాన్ని గుర్తించకుంటే ఎట్లా?" అని.

లోపల్నించి తలెత్తింది ఆమె. అదే చూపు.

అతని మాటలమీద నమ్మకం చెడిన చూపు.

మనస్సు కొంత అభద్రతకు గురైంది అతనికి.

చెప్పుల్లో కాళ్లు దూర్చి బైటకు నడిచాడు.

* * * *

సాయంత్రమైంది. సంతకు దగ్గరగా ఉన్న టీచర్స్ సెంటర్ రద్దీగా ఉంది.

ఉమ్మడి సీనియారిటీ, పే ఫిక్సేషన్, డిఎ పెంపుదల, యింటీరియమ్ రిలీఫ్; యూనియన్ గొడవలూ, ఎంయీవోల మీద ధ్వజమెత్తటాలూ... వాహనాల రొదలతో దుమ్ముధూళిపొగల్ని పీల్చుకుంటూ టీకొట్ల ముందు గుమిగూడి ఉన్నారు ఉపాధ్యాయులంతా.

"ఎప్పుడూ జీతాల గురించీ ఇంక్రిమెంట్ల గురించీ తప్ప వీళ్లకు మరొకటి పట్టదు. పిల్లలకు ఎట్లా చదువు చెప్పాలా అని ఒక్కరోజన్నా డిస్కస్ చేసికొంటే విందామని ఏళ్ల తరబడి వెయిట్ చేస్తావుండా. నా కోరిక తీరేట్టు లేదు. పనిచేసే విలేజ్‌లోనే ఫ్యామిలీ పెట్టేట్టు చేస్తే తప్ప యీ వ్యవస్థ బాగుపడదు" రిటైర్డ్ డాక్టర్ వొకాయన మరో రిటైర్డ్ యింజనీర్‌తో వ్యాఖ్యానిస్తూ వెళుతున్నాడు.

ఆ మాటలు టీచర్ల చెవిన పడ్డాయి.

ఒకరిద్దరు ప్రభాకర్‌కేసి చూశారు 'విన్నావా' అన్నట్టు.

వెంటనే నోరు తెరిచాడు ప్రభాకర్.

"ససవర్లయ్యా వాల్లు. ససవరి సాపట్ల పోస్తే బురబుర పొంగుతాదంట. వాల్లకేం? ఏమైనా మాట్లాడ్తారు. ఆయప్ప జీవితంలో ఒక్క తూరే పొడిచి నరం సూది వేసింటాడా? చెయ్యంతా వంద తూట్లు పొడిస్తేగాని నరం కనుక్కోలేదు. ఆయప్పా మాట్లాడ్తే ఎట్లా?" గట్టిగా అన్నాడు.

టీచర్లంతా నవ్వారు.

ఓరగా అటుకేసి చూస్తూ తమకు వినిపించ నట్లే వెళ్లిపోయారు ఇద్దరూ.

కొంత సేపయింతర్వాత పక్క మండలాన్నించి వచ్చిన ఉపాధ్యాయ మిత్రుడొకడు ప్రభాకర్‌కు కంగ్రాట్స్ చెప్పాడు. "యువారే జీనియస్ బ్రదరూ" అంటూ – అతని భార్యకు పోస్టింగ్ తెప్పించుకున్న సందర్భాన్ని ఉటంకిస్తూ.

తలపట్టుకొని భారంగా ఫీలయినట్లుగా అభినయించాడు ప్రభాకర్.

"నాదేముంది భాయ్? మా మిసెస్ కష్టపడింది. తను స్వంతంగా టెస్ట్ రాసి పోస్ట్ కొట్టేసింది" చెప్పాడు.

ఆశ్చర్యంతో కూడిన మిత్రుని ప్రతిస్పందన.

ససేమిరా నమ్మను అన్నట్టుగా చూపు.

అదంతా 'గ్యాస్' అన్నట్లుగా పెదవి విరుస్తోన్న మిత్రులు.

ప్రభాకర్‌కు థ్రిల్లింగ్‌గా ఉంది.

తనెంత నిజం చెప్పినా వాళ్ళు నమ్మరు. తన సామర్థ్యాన్ని మరింత గొప్పగా అనుమానిస్తుంటారు. ఇట్లా తను నిజం చెప్పటంలో భార్య సమర్థతను కప్పిపుచ్చకుండా ఆమె పట్ల తను నైతిక విలువ పాటించినట్లుగా కూడా ఉంటుంది.

అతను తరచూ మిత్రుల వద్ద నిజం చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు. తను నిజాన్ని చెప్పటం... వాళ్లెవరూ నమ్మకపోవటం.. పదేపదే తను నిజాలే చెబుతూ పోవటం...అదో ఫ్యాషన్‌గా కూడా అన్పించింది.

ఊరి నించి బావమరిది వచ్చాడు.

"సాధించిందోయ్ మీ అక్క. నాతో కాని పని తను చేసి నిరూపించింది" సుశీలకేసి ఓరకంట చూస్తూ చెప్పాడు.

బావకేసి అనుమానంగా చూశాడు అతను.

"నిజంగానే మీ అక్క తోడు" నమ్మబలికాడు ప్రభాకర్.

అతని బావమరిది సులభంగానే నమ్మేశాడు.

ఉపాధ్యాయ మిత్రుల్లాగా యింకా బావగారి సామర్థ్యాన్ని పట్టుకొని వేలాడలేదు. ఇన్నేళ్లూ బావచేసిన ప్రయత్నాలన్నీ అతనికి తెలుసు. బావ మనస్సు తెలుసు. అక్క పట్ల అతని ప్రవర్తన తెలుసు. అక్క ప్రతిభను చులకన చేసినందుకు ఆమె తగిన బుద్ధి చెప్పిందని లోలోపల సంతోషంగా ఉంది అతనికి. తన ఆనందాన్ని బంధువులందరితో చెప్పి పంచుకున్నాడు.

ప్రభాకర్ కూడా ఒకరిద్దరు ఆప్తమిత్రుల వద్ద సుశీలకు పోస్ట్ రావటంలోని రహస్యాన్ని విశ్వసనీయంగా ఒప్పుకోవటంతో సదరు పరమరహస్యం పాదరసంలా మిత్రుల మధ్య కూడా పాకింది.

అతనింకా జనాలకు ఆమె సమర్థతను గురించి చెప్పి వాళ్ళు ఆశ్చర్యపడటాన్ని ఎంజాయ్ చేస్తున్నాడు.

"మన పెండ్లాలకు కూడా మనం అవకాశమివ్వాల. వాళ్లేమిటో ప్రూవ్ చేసుకొనేలా చూడాల" అంటూ నీతివాక్యాలు కూడా పలుకుతున్నాడు.

తన మాటలు జనమింకా నమ్మటం లేదనే అనుకొంటున్నాడు. వాళ్లింకా అపనమ్మకంతోనే తన కేసి చూస్తున్నారనీ, దాని వెనక తన సామర్థ్యత యింకా వెలిగిపోతూనే వుందనీ భావిస్తున్నాడు.

ఆరోజు సాయంత్రం మొదటిసారిగా అతనికి తగలరాని చోటే దెబ్బ తగిలింది. భార్య సమర్థతను గురించి తను చెబుతోంటే మిత్రుడన్నాడు.

"అవును. నువ్వు తప్పే చేశావు. మొదటే ఆమెకు స్వేచ్ఛ యిచ్చి ఉంటే ఫస్ట్ అటెంప్ట్‌లోనే పోస్ట్ తెచ్చుకుని వుండేది. యిన్ని రోజులూ ఆమె సమర్థతను నువ్వు గుర్తించకపోవటమే కాకుండా మమ్మల్ని కూడా తప్పుదోవ పట్టించినావు" అని.

అతని మాటల్ని నమ్మలేనట్లుగా చూడటం యిప్పుడు ప్రభాకర్ వంతయింది.

'యింతకాలం నీ గోల్‌మాల్ గందరగోళాన్ని నమ్ముకొని ఆమె మేధావితనాన్ని తొక్కిపట్టినావు. నిజంగా నువ్వేమీ ఫీల్ కావటం లేదా ప్రభాకర్?' మరో మిత్రుడు నిలదీశాడు.

తన డొల్లతనమేదో బైట పడ్డట్టుగా అన్పించింది అతనికి. కొంత సిగ్గుగా కూడా తోచింది.

తనింతకాలం పేర్చుకుంటూ వచ్చిన కట్టడమేదో బీటలు వారి కూలిపోయేందుకు సిద్ధమైనట్లుగా భావన కలిగింది.

*　　*　　*　　*

బంధువర్గంలో సుశీలకు గౌరవం పెరిగింది. ఉపాధ్యాయలోకంలో కూడా ఆమె పట్ల ఉన్నత భావం కలిగింది.

ప్రభాకర్ ఎత్తిపొడుపు మాటల్ని భరిస్తూ ఇద్దరు పిల్లల సంసారాన్ని యీదుతూ కూడా డిఎస్సీలో తన ప్రతిభ నిరూపించి ఉద్యోగం సంపాదించుకోవటంతో చాలామందికి ఆదర్శప్రాయమైంది.

పోస్టింగ్ అలాట్‌మెంట్ కోసం కౌన్సిలింగ్ డేట్ అనౌన్స్ చేశారు.

సుశీలకు లోపల ఆందోళనగా ఉంది. స్వంత మండలంలో ఖాళీలు తన వరకు వస్తాయో రావో. ఇతర మండలాలకు వెళితే మూడేళ్లపాటు అవస్థలు పడాలి. భర్త, పిల్లలు, సంసారం, ఉద్యోగం మధ్య నలిగి చావాలి.

దాని గురించి భర్తతో సంప్రదించి 'ఎట్లా చేద్దా'మని అడిగింది. అదేమంత పెద్ద విషయం కాదన్నట్టుగా తేలిగ్గా చప్పరించి వదిలాడు అతను.

"మన మండలానికి రావాల. వీలైతే టౌనుకు దగ్గరగా వుండేస్కూల్‌కు అలాట్ చేయించాల. అంతేగదా. దాన్ని గురించి నువ్వు మర్చిపో" చెప్పాడు సిగరెట్ ముట్టించుకుంటూ చిద్విలాసంగా.

ఆమె నుంచి సమాధానం రాకపోయేసరికి అగ్గిపుల్ల విసిరేస్తూ ఓరగా చూశాడు. తనకేసే దూసుకొస్తూ ఆమె చూపులు. తన మీద నమ్మకం లేని చూపు. తన సమర్థతను శంకించే చూపు. అదే చూపు....

"ఎందుకట్లా చూస్తావ్? ఈజీ. గతంలో ఎన్నో చేశాం, మనకు కావాల్సిన ప్లేసును లిస్ట్‌లో చూపించకుండా మేనేజ్ చేసికొంటే సరి. లేదా మన మక్కడే వుండి మనకు కావల్సిన ప్లేసును ఎవ్వర్నీ కోరుకోనీకుండా చేస్తే సరి. యీజీ" చెప్పాడు.

కొద్ది క్షణాలు అతనికేసి సూటిగా చూసింది ఆమె.

తర్వాత అంది. "నువ్వేమీ మేనేజ్ చెయ్యొద్దు స్వామీ. ఆ తంటాలేవో నేనే పడతా" అని.

సుశీలకేసి ఆశ్చర్యంగా చూశాడు అతను.

తన సామర్థ్యాన్ని యింత దారుణంగా అనుమానిస్తోన్న ఆమెకేసి నిర్విణ్ణుడై చూశాడు.

కౌన్సిలింగ్‌లో అయినా తనేమిటో నిరూపించుకోవాలనుకున్నాడు.

ఆమె తనకా అవకాశం యివ్వటంలేదు.

తనేదో కోల్పోతున్నట్టుగా.. అంతో యింతో మిగిలిందనుకొంటూ ఉన్న గౌరవం కూడా జారిపోతోన్నట్టుగా అస్తిత్వం కోల్పోతున్నట్టుగా ఫీలవసాగాడు.

సాయంత్రం తన పుత్రరత్నం దగ్గరగా వచ్చి "డాడీ డాడీ" అంటూ గీరాడు.

'ఏమి' టన్నట్టుగా చూశాడు.

"మమ్మీ జాబ్‌ని లేట్ చేసింది నువ్వేనంటగా" అన్నాడు.

వాడనేదేమిటో అర్థమయ్యేసరికి వేడిశ్వాస బైటికొచ్చింది ముక్కుపుటాల్లోంచి.

నేరుగా లోపలికెళ్లాడు.

"దేశమంతా తెలిసిపోయింది నువ్వో మేధావివనీ, నేనో రోగ్‌ననీ. ఈ విషయాన్ని పిల్లలకు కూడా నేర్పి పంపాలా?" అడిగాడు సీరియస్‌గా చూస్తూ

అయోమయంగా కళ్లెత్తింది ఆమె.

"నేను చెప్పలేదు" అంది.

"అయితే నేనే చెప్పిన్నేమో. మీ డాడీ ఎంత బేవార్స్ నా కొడుకో వినరాఅని" వ్యంగ్యంగా అన్నాడు.

అంతలో వెనగ్గా సుపుత్రుడు గొంతెత్తాడు.

"మమ్మీ చెప్పలేదు. మా టీచర్...మా టీచర్"

భర్తకేసి సూటిగా చూసింది సుశీల.

"ఆ టీచర్‌కు ఎవరు చెప్పినట్టో?" ఎత్తి పొడిచాడు.

"ఇదంతా నీ మేధావితనమేనని నేనేగదా అందరికీ చెప్పింది. నేను గోల్‌మాల్‌చేసి పోస్ట్ తెప్పించానని చెప్పుంటే ఒక్కరూ నీ టాలెంట్‌ను గుర్తించరు గదా. నిజం చెప్పినందుకు ఇదా నాకు శిక్ష" అంటూ విసవిసా బైటకు నడిచాడు.

అతనికి బాధగా ఉంది.

ఆరు ఔన్సుల మత్తు తూగేంత ఆవేదనగా ఉంది.

* * * *

ఇంకా స్కూలుకు ప్రయాణం కాలేదు ప్రభాకర్.

సంజీవ్ స్కూటరొచ్చి యింటి ముందాగింది.

కాఫీ తాగుతూ యిద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు. ఆ సందర్భంగా సుశీల మండల అలాట్‌మెంట్ విషయం ప్రస్తావనకు వచ్చింది.

"నువ్వు తల్చుకుంటే అదేమంత గొప్ప విషయమా గురువా" అన్నాడు సంజీవ్.

"నువ్వనుకుంటే ఏమైనా చేయగలవు. నందిని పంది...పందిని నంది"

మిత్రుని మాటలు వింటూ చిన్నగా నవ్వుతూ ఉండిపోయాడు ప్రభాకర్.

అతని నవ్వులో సంజీవ్‌కు ఏదో అనుమానం.

"నాకు తెలిసి ఆమె ఉద్యోగం విషయంలో కూడా నువ్వేమీ చేయలేదంటే నేను నమ్మలేను గురువా" అన్నాడు.

ఇప్పుడు ఖండించదల్చుకోలేదు ప్రభాకర్.

ఆ మాటకు కూడా నవ్వుతూ ఉండిపోయాడు.

"హమ్మయ్య. బతికించినావు. అదేగదా. నీ హ్యాండ్ సాగలేదని నువ్వెంత నంగనాసి మాటలు చెప్పినా నేను నమ్మలేదనుకో. ఇద్దరు పిల్లల తర్వాత సంసార బాధ్యతల్ని నెత్తికేసుకొని యీదుతూ 'సిస్టరేందీ... డిఎస్సీలో సెలక్ట్ కావడమేంది?' అని డౌటు పడ్తానే వున్నె. నువ్వేమో తుంగ బుర్రవై ఫోజులు పెడ్తాంటివి. గురువా మేమంతా వొచ్చి సాయం జెయ్యమని అడుగుతామని బయపన్నెవు గదూ" అన్నాడు సంజీవ్.

ప్రభాకర్ మనస్సులో ఏదో వెలితి పూడిన అనుభూతి.

తన మగ అహంకారం బతికి జీవం పోసుకొన్నట్టుగా ఫీలింగ్.

చిద్విలాసంగా నవ్వులు చిందించాడు.

లోలోపల మాత్రం ఏదో అలజడి.

ఆమెకేసి చూద్దామనిపించింది గాని ఆమె చూపుల్ని భరించే శక్తి తనకున్నట్లుగా తోచలేదు.

ఆమెకేసి తలెత్తేందుక్కూడా ధైర్యం చాల్లేదు.

కాఫీ తెచ్చి అందిస్తోన్నపుడు సైతం ఆమె కళ్లలోకి చూడలేకపోయాడు.

ఆమె చూపులు తనను శల్య పరీక్ష చేస్తున్నాయోమోననే ఫీలింగ్

అదే చూపు...

తన మగ అహంకారాన్ని పసిగట్టిన చూపు.

తన మోసపూరిత మానసిక స్థితిని పట్టుకొన్న చూపు.

ఆ చూపును భరించే శక్తి తనకు లేదు.

తలెత్తకుండానే మిత్రున్ని చాటు చేసుకొని బైటక్కదిలాడు ప్రభాకర్.

◆ *ఆంధ్రజ్యోతి సండే - 31.7.2005, తెలుగునాడి అమెరికా పత్రిక* ◆